## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పలువురికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావడం జరిగింది. అందులో భాగంగా మండల ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభకు టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ హాజరవగా వారి చేతుల మీదుగా అవార్డు గ్రహీతలు కర్రీ ధర్మారావు, ఆళ్ల సుధాకర్, కే.సంపత్‌రావు, భాస్కర్ శారద, కే.వీరి నాయుడు, ఎస్.ప్రేమ్ కుమార్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతి రాజు, మండల విద్యాశాఖ అధికారి బి.సత్తిబాబు, ఏపీటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మంచి భోజనం అందించాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - అనకాపల్లి: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా, పరిశుభ్రంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమా దేవికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణింద్ర కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద కుటుంబానికి సంబంధించిన విద్యార్థులకు సక్రమమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుంది కానీ కొన్ని పాఠశాలలో విద్యార్థులకు న్యాయమైన సక్రమమైన భోజనం అందించడంలో విఫలం అవుతున్నారన్నారు. మరికొన్నిచోట్ల ఎక్కువ రోజులు నిల్వ ఉన్న ఆహారాన్ని పిల్లలకు పెట్టడం వల్ల ఫుడ్ పాయిజన్ వంటి సమస్యల వల్ల విద్యార్థుల ప్రాణాలు బలవుతున్నాయని అన్నారు. కాబట్టి తక్షణమే జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏ విధంగా అమలు చేస్తున్నారనే దానిపై పర్యవేక్షించాలని పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం కాకుంటే పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకరం చుడతామని హెచ్చరించారు.

# బీఎన్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

విశాలాంధ్ర - రావికమతం: ప్రమాదకరంగా మారిన నర్సీపట్నం - చోడవరం బిఎన్ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొత్తకోట శ్రీ శాంతి ఆటో యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. దొండపూడి ఫారెస్ట్ చెక్ పోస్టు నుంచి ఆటోలతో ర్యాలీ చేపట్టిన యూనియన్ సభ్యులు కొత్తకోట జిల్లా పరిషత్ పాఠశాల వద్ద గోతుల రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.బుల్లిబాబు, సిహెచ్. నాగు, టి.శేఖర్, యు.సత్తిబాబు తదితరులు మాట్లాడుతూ నర్సీపట్నం నుంచి చోడవరం వెళ్లే బిఎన్ రోడ్డు గత ఐదేళ్లుగా గోతులతో ప్రమాదకరంగా మారిందని వాపోయారు. ఇటు నర్సీపట్నం అటు చోడవరం వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీలు, ఉద్యోగులు, అధికారులు నిత్యం ఈ రోడ్డులో ప్రయాణం చేయడం అంటే హడలి పోతున్నారన్నారు. పాలకులు స్పందించి కనీసం గోతులు పూడ్చే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు, హెచ్‌సి కన్నారావు బందోబస్తు నిర్వహించగా పలువురు వాహన దారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో గ్రాండ్ పేరెంట్స్ డే

విశాలాంధ్ర - నర్సీపట్నం: స్థానిక శారద నగర్ రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు. సుమారుగా 40 మంది తాతయ్య, అమ్మమ్మ, నానమ్మలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వారి వయసును మరచి చిన్నారులతో గ్రాండ్ పేరెంట్స్ చేసిన నృత్యాలు, ఆటపాటలు అందరినీ ఎంతగానో ఆకట్టు కున్నాయి. కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాల్ కే.గిరిధర్, డి.ఐ. చప్పా, గోవింద, చిన్నారులు, గ్రాండ్ పేరెంట్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విజయవాడ వరద బాధితులకు చీరలు, దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: విజయవాడ వరద బాధితులకు టీడీపీ నాయకులు చీరలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. విజయవాడ 56వ డివిజన్ రాజరాజేశ్వరి పేట, మహంకాళి రోడ్, డివిఆర్ ర్యాంప్ తదితరుల ప్రాంతాలలో సుమారు 1500 మందికి చీరలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. టీడీపీ విశాఖ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గొర్రెల రాజబాబు, పట్టణ మాజీ అధ్యక్షులు మజ్జూరి నారాయణరావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలిగట్ల శ్రీను, దేవ వరపు ఆనంద్ కుమార్, గొల్లపల్లి నాగు, తలారి రాజా, పడాల కోటి, భజంత్రీల శివ, దాసరి రాజేష్, నారపరెడ్డి నానాజీ, గంటా థామస్, ముత్తి జగదీష్, చొక్కా శ్రీను, విశ్వనాథుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన డీఈఓ

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని చుక్కపల్లి జిల్లా పరిషత్తు హై స్కూలును జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ శుక్రవారం సందర్శించారు. హిందీ దివస్ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ అభ్యాసన సామగ్రి పరిశీలించారు. అనంతరం పాఠశాల హెచ్.ఎం. బి.వి.రమణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్య క్రమంలో విద్యార్థులను ఉద్దేశించి డి.ఈ.ఓ. మాట్లాడుతూ జాతీయ భాషల్లో హిందీ ఒకటి అని, ప్రతీ ఒక్కరూ హిందీ క్షుణ్ణంగా నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించారు. ఉత్తమ హిందీ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చీమకుర్తి ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తురువోలు హెచ్.ఎం. రామకృష్ణ, పాఠశాల ఉపా ధ్యాయని టి.ఉషారాణి, సహోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్ర

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి రూరల్ ఎస్ఐగా ఎం. ఉపేంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కేడీపేట ఎస్ఐగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా యలమంచిలి రూరల్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం.ఉపేంద్ర మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూనే చట్టాన్ని ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తానని, నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాల అరికడతామని, దానితో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్, పాల్పడే వారి పట్ల కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. అదేవిధంగా ఆపద సమయంలో డయల్ 100 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని పొందాలని ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ఐ తెలిపారు.

## సామూహిక లక్ష కుంకుమ అర్చనలు

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని పి.ఎస్.పేట బ్రాహ్మణ వీధిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో శుక్రవారం హేరుద్ర, కుంకుమ లేపన అవతారంలో స్వామి దర్శనమిచ్చారు. శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో నిర్వహిస్తున్న 133వ గణపతి నవరాత్రులు సందర్భంగా ఏడవ రోజు అయిన బుధవారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. లక్ష్మీ సహస్ర నామాలతో మహిళలచే సామూహిక లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. నవరాత్రులు సందర్భంగా ప్రతీ రోజూ లక్ష్మీ గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్, శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు పుట్రేవు శ్యామ్ ప్రసాద్ తెలియజేసారు. ఎస్.ఎల్.జి.ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవరాత్రుల్లో ప్రతీ రోజూ భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తున్నామన్నారు.

# సీతారాం ఏచూరికి ఘన నివాళులు

విశాలాంధ్ర - అనకాపల్లి/మునగపాక: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం పట్ల సీపీఐ అనకాపల్లి శాఖ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. అనకాపల్లి సీపీఐ పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం మాట్లాడుతూ కామ్రేడ్ ఏచూరి విద్యార్థి దశ నుండే వామపక్ష ఉద్యమానికి ఆకర్షితుడై సిపిఎం పార్టీ నిర్మాణానికి విశేషమైన కృషి చేశారన్నారు. రాజ్యసభ సభ్యునిగా, ఎంపీగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను పార్లమెంటులో ఎండగట్టిన మహా పార్లమెంటేరియన్ అని కొనియాడారు. ఆయన అంచెలంచలుగా ఎదిగి సిపిఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను చేపట్టారన్నారు. వామపక్ష ఉద్యమానికి ఆయన లేని లోటు పూడ్చలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మత్తుర్తి సూరిబాబు, ముక్కామల చిన్ని, దొడ్డి సూర్యారావు, కొమ్మనాపల్లి వెంకటరమణ, గ్రంధి శ్రీనివాసరావు, సూది కొండ బాల తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణానికి సంతాపంగా శుక్రవారం సిపిఎం ఇతర ప్రజాసంఘాల నాయకులు మండలంలో తోటాడ గ్రామంలోని సుందరయ్య గ్రంథాలయం వద్ద ఘనంగా నివాళులర్పించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, ఆళ్ళ మహేశ్వరావులు పూల మాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వామపక్ష రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని దేశంలోనే రాజకీయాలకు వన్నెతెచ్చిన నేతగా ఏచూరిని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, పి.జోగినాయుడు, దాడి రమణ బాబు, పి.భాగేశ్వ రావు, రాపేటి పరమేష్, ఆడారి రామలక్ష్మి, పి.లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: రావికమతం మండలం కొత్తకోట సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో పలువురు వామపక్ష పార్టీ నేతలు కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.గోవిందరావు మాట్లాడుతూ రెండు రోజులపాటు పార్టీ శాఖలు ఆధ్వర్యంలో సంతాప దినాలు నిర్వహించినట్లు తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి జి.జోగిరాజు మాట్లాడుతూ ఎర్ర సూరీడు, కమ్యూనిస్ట్ మేధావి నెలకొరిగారని ఆయన మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వి.రమణ, గిరిజన సంఘం నాయకులు పాడి బన్నయ్య, రాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని గుంటికొత్తూరు గ్రామంలో సీపీఎం మండల అధ్యక్షుడు రొంగలి దేముడునాయుడు, జిల్లా నాయకులు గంటా శ్రీరామ్ ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు పోరాట యోధుడు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి ఇక లేకపోవడం ప్రజలకు, ప్రజా సంఘాలకు పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిఎస్ శ్రీనివాస్, గంటా సిన్నాలు, గంటా సింహాచలంనాయుడు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అంతా బూడిదమయం: ఆందోళనలో ప్రజలు

విశాలాంధ్ర - పరవాడ: మండలంలోని అనకాపల్లి - లంకెలపాలెం రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. నిత్యం వందలాది ఫ్లైయాష్ లారీలు రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు మొత్తం ధ్వంసమైంది. దీనికి తోడు ఫ్లైయాష్ రోడ్డుపై పడుతుం డడంతో గాలికి ఎగిరి కళ్లల్లో పడుతుంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఈ మార్గంలో లంకెలపాలెం మీదుగా సుమారు 40 నుంచి 50 టన్నుల లోడుతో డంపర్లు జోరుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి వల్ల రోడ్డు ధ్వంసం కావడమే కాకుండా ఫ్లైయాష్ రోడ్డుపై పడుతుండడంతో గాలికి ఎగసి పడుతోంది. రోడ్డును ఆనుకొని ఉన్న లంకెలపాలెం, మంత్రి పాలెం, కన్నూరు, పెదముషిడివాడ, గండివానిపాలెం, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం తదితర గ్రామాల్లో బూడిద గాల్లో ఎగసి పడుతుండడంతో ఇళ్లలోకి చేరి ఆహార పదార్థాలు, తాగునీరు కలుషితం అవుతోందని మహిళలు వాపోతున్నారు.

వాహనాల నుంచి రోడ్డుపై బురద మాదిరిగా కారడంతో మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ సెంటర్లు, కిరాణా దుకాణాలు, మాంసం దుకాణాల్లోకి బూడిద చేరి వ్యాపారులు నష్టపోతున్నారు. పైగా ఫ్లైయాష్టం పర్లు, లారీల రాకపోకలను అరికట్టాలని లంకెలపాలెం నుంచి అసకపల్లి వరకు ఉన్న గ్రామాల ప్రజలు అనేక సార్లు ధర్నాలు, ఆందోళనలు చేశారు. కలెక్టర్కు కూడా స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేడని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఫ్లైయాష్ రవాణా చేసేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదని, దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బూడిద ఎగర కుండా కనీసం వాటరింగ్ లాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో పరిసర గ్రామాల ప్రజలు పలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్ప టికైనా అధికారులు స్పందించాలని లేకుంటే ఉద్యమిస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## ప్రశాంతి పాలిటెక్నిక్‌లో రక్తదాన శిబిరం

విశాలంధ్ర - అచ్యుతాపురం: రక్తదానం ప్రాణాదానంతో సమాన మని ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ దర్మిరెడ్డి ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజ్‌లో ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి కెడేట్లు నిర్వహించిన రక్తదాన శిబిరంలో 42 మంది ఎన్‌సిసి కెడేట్లు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎన్‌సిసి కెడేట్లను లెఫ్టినెంట్ కల్నల్ పల్లవి వర్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కేడీ పేట ఎస్ఐగా దివ్య బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - గొలుగొండ: అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవి పేట పోలీస్ స్టేషన్ ఎస్ఐగా టి.దివ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై ఎం.ఉపేంద్రకు ఎలమంచిలికి బదిలీ అయింది. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ టి.దివ్య మాట్లాడుతూ కృష్ణదేవి పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా గంజాయి రవాణా, నాటు సారా నిర్మూలనకు, దొంగతనాలు నిరోధించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

## మూసురువారి కల్లాల వద్ద తాత్కాలిక వంతెన నిర్మాణం

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని ఖండివరం నుండి మాడుగులకు వెళ్లే దారిలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మూసురువారి కల్లాల వద్ద మదుము కొట్టుకుపోవడంతో పంచాయతీ సెక్రటరీ వీర్రాజు తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వాహన దారులు, రైతులు రాకపోకలకు ఇబ్బందులు కలుగు తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు.

## జాగారం గెడ్డ గండి పూడ్చివేతకు నగదు మంజూరు

విశాలాంధ్ర - మాకవరపాలెం: జాగారం గెడ్డ గండి పడిన ప్రాంతంలో తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు రూ.6 లక్షలు మంజూరు చేశారని జి.కోడూరు టీడీపీ పార్టీ అధ్యక్షులు మళ్ళ జయబాబు, టీడీపీ నాయకులు ఆడారి బాను తెలిపారు. శుక్రవారం గండి ప్రాంత రైతులతో జయబాబు నర్సీపట్నం లో అయ్యన్నపాత్రుడుని కలిశారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.6 లక్షలు మంజూరు చేశారన్నారు. అంతే కాకుండా వర్షాలు తగ్గాక శాశ్వత మరమ్మతులు చేసేందుకు కూడా రూ.20 లక్షలు రూపాయలు మంజూరు చేసినట్లు జయబాబు తెలిపారు. సమస్యను విన్న వెంటనే స్పందించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడుకి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నులిపురుగుల నివారణ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - నక్కపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ డి.సీతారామరాజు ఆధ్వర్యంలో కార్యదర్శులు, మెడికల్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ సీతారామరాజు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, నులిపురుగులు నివారణ మందులు పంపిణీ చేసి, పిల్లలు నులిపురుగులు మందులు తీసుకొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు మండలంలో గల ఏఎన్ ఎంలకు నులుపురుగుల మందులు పంపిణీ చేశారు. అనంతరం నులిపురుగుల నివారణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గొడిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణి సంధ్య, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఎంపిహెచ్ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి చేతులు శుభ్రత పరిశుభ్రమైన వాతావరణం భోజనం తినే సమయంలో సురక్షితమైన మంచినీరు తీసుకునే విధంగా ఉపాధ్యా యులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా 17వ తేదీన నులి పురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు వేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి వాసంతి, ప్రధాన ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 28 దుకాణాలు కేటాయింపు

విశాలాంధ్ర - విశాఖ: సిరిపురం బాలల ప్రాంగణంలో విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డిఏ) సిరిపురం జంక్షన్లో ఉన్న ఉద్యోగ్ భవన్ కాంప్లెక్స్, గాంధీజీ కాలనీ, సీతమ్మధార, లాసన్స్ బే కాలనీ, మాధవధార, కూర్మన్నపాలెం, కైలాసగిరి, రామ్ నగర్, వీఎంఆర్డీఏ పార్కు, టియు-142, సెంట్రల్ పార్క్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ షాపులు.. ఆడిటోరియంలు, ఆఫీసులు ఖాళీ స్థలాలను నెలసరి/సంవత్సరం అద్దె చెల్లింపు ప్రాతిపదికపై ఇచ్చేందుకు నిర్వహించిన బహిరంగ వేలంలో 28 దుకాణాలు కేటాయించారు. అత్యధికముగా ఎంవీపీ కాలనీ, సెంట్రల్ పార్క్ ఎదురుగా ఉన్న దుకాణాలకు, కైలాసగిరిపై, రాంనగర్ లో ఉన్న షాపులను దరఖాస్తుదారులు పాడుకున్నారు. ఈ బహిరంగ వేలాన్ని మెట్రోపాలిటన్ కమీషనర్ కెఎస్ విశ్వనాథన్, కార్యదర్శి దాట్ల కీర్తి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డిఎఫ్ఓ శాంతి స్వరూప్, పరిపాలనాధికారి వేంకటేశ్వరరావు, డిఇ రవిశంకర్ తదితరులు నిర్వహించారు.

# దివ్యాంగులు పారా షూటింగ్ పోటీలలో సత్తా చాటాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం వేదికగా వైఎంసిఎ, బీచ్ రోడ్డు నందు ఈ నెల 29వ తేదీన ప్రారంభం కానున్న 3వ రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల గోడ పత్రికను విశాఖపట్నం జిల్లా దివ్యాంగుల వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవీ లత శుక్రవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి సహకారంతో ఈ రాష్ట్ర స్థాయి పారా షూటింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాధవీ లత మాట్లాడుతూ ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి దివ్యాంగ పారా క్రీడాకారులు పాల్గొని మీ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పారా షూటింగ్ ఛాంపియన్షిప్ కు ఎంపిక అవ్వాలని ఆకాంక్షించారు. ఈ రాష్ట్ర స్థాయి పారా షూటింగ్ పోటీలలో పాల్గొనే పారా దివ్యాంగ క్రీడాకారులు ఈ నెల 25 లోపు ఈ క్రింద ఇవ్వబడిన 7095811456/ 9390131777 నంబర్లకు సంప్రదించి వెంటనే మీ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, పీ.కే జోష్, శీతల్ మదన్, షూటింగ్ కోచ్ మల్లేష్, షేక్ గులాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ ముంపు ప్రాంతాలలో మంత్రి నారాయణ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విజయవాడ వరద ముంపు ప్రాంతాలలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మోటార్ వాహనం పై జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ తో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి తో కలిసి 64వ వార్డులోని కండ్రిక, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాలలో, అలాగే 282, 284 సచివాలయాలలో పర్యటించామన్నారు. 64వ వార్డులో ఎన్.ఎస్.సి బోస్ నగర్, కండ్రిక ప్రధాన రోడ్డుకు ఆనుకుని వున్న అంతర్గత కాలనీలు, వీధులలో వరద నీరు, మురుగు నీరు కాలువలలో చేరి ఆయా ప్రాంతాలులో నీటి నిల్వలను మున్సిపల్ మంత్రి మోటార్ సైకిల్ పై పరిశీలిస్తూ శుక్రవారం ఉదయం పర్యటించి సాయంత్రం సమయానికి గల్ఫర్ మిషన్ లతో ఆ నీటిని తొలగించాలని తదుపరి ఫైర్ఇంజన్ల సహాయంతో బురదను తీసివేసి పరిశుభ్రపరిచే చర్యలను చేపట్టాలని ఆదేశించగా మురుగు నీటిని, బురద తొలగించే కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేయడం జరిగిందని కమీషనరు తెలిపారు. ఆ వరద నీటిని పూర్తిగా తొలగించిన పిదప పారిశుద్ధ కార్మికులచే రోడ్లను పరిశుభ్రపరుస్తున్నామని ఆయన తెలిపారు.

జివిఎంసి నుండి విజయవాడ వరద ముంపు ప్రాంతాలలో 1500 కు పైగా పారిశుధ్య కార్మికులు 27వ వార్డు నుండి 64వ వరకు పలు వీధులలో, కాలనీలలో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టి నిరంతరం సహాయక చర్యలలో పాల్గొంటూ విధులు నిర్వహిస్తున్నారని, మున్సిపల్ మంత్రి ఆదేశాల మేరకు తనతో పాటు అధికారులు నిత్యం వరద ముంపు ప్రాంతాలలో పర్యటిస్తూ బాధితులకు కావలసిన మౌళిక సదుపాయాలను, నిత్యావసర వస్తువుల అందజేత కార్యక్రమాలను చేపడుతున్నామని కమీషనరు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎస్.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వీఎంఆర్డిఏ ప్రణాళికా విభాగంలో బదిలీలకు అవకాశం

## పలువురిపై ఆరోపణలు

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డిఏ ప్రణాళిక విభాగంలో కొందరిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పలువురికి బదిలీలు జరగనున్నట్లు తెలుస్తోంది. కొందరు బదిలీలకు దరఖాస్తు చేసుకోగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరిని ప్రభుత్వం బదిలీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లానింగ్ అధికారి వెంకటేశ్వర రావును జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ కోరుతున్నట్టు సమాచారం. సియూపీ సంజయ్ రతన్ కుమార్ కి బదిలీ జరిగే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. ఈ స్థానంలోకి వచ్చేందుకు గతంలో ఇక్కడ పనిచేసిన ప్రభాకర్ రావు ప్రయత్నిస్తుండగా ప్రభుత్వం బదిలీల సిఫారసులను అంగీకరించే అవకాశాలు లేవని తెలుస్తోంది. జీవీఎంసీ సిసిపి సురేష్ కుమార్ ని ప్రభుత్వం బదిలీ చేయగా ఆయన్ని ఇక్కడే ఉంచాలని శాసనసభ్యులు కోరినా ఫలితం కనిపించలేదు. దీన్ని బట్టి ప్రణాళిక విభాగంలో సిఫారసులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని అవకాశం లేదని చెబుతున్నారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ ఈ విషయంలో స్పష్టంగా ఉన్నట్టు తెలుస్తోంది. విఎంఆర్డిఏ ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న కొందరు జేపిఓలపై మంత్రికి ఫిర్యాదులు వెళ్లినట్టు తెలుస్తోంది. కొందరు జేపీవోలు అప్రూవల్స్ కి ముందే డబ్బులు తీసుకుని తరువాత షార్ట్ ఫాల్స్ ఇస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై కొందరు మంత్రికి, విఎంఆర్డీఏ ఎంసీ కి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. వీఎంఆర్డీఏ ప్రణాళిక విభాగంలో ప్రతి పనికి ఫిక్స్ డ్ రేట్లు ఉండగా, ఒకరిద్దరు అధికారులు మాత్రం భారీగా డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. వాళ్లు అడిగినంత డబ్బులు ఇచ్చుకోలేక దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

గంట సేపే అనుమతి :

విఎంఆర్డిఏ ప్రణాళిక విభాగంలోకి సాయంత్రం నాలుగు నుంచి ఐదు మధ్యలో గంట సేపు మాత్రమే సందర్శకులను అనుమతిస్తున్నారు. మిగతా సమయంలో ఎవరు రాకూడదని ఎంసి ఆదేశాలు ఇచ్చారు. డబ్బులు ఇచ్చినా పని అవ్వని పరిస్థితుల్లో ఎల్టీపీలను, దరఖాస్తుదారులను అనుమతించకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలి. దీనివల్ల వ్యవహారాలు బయట నడుస్తాయి తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల మధ్య రావడానికి సందర్శకులకు అందరికీ వెసులుబాటు ఉండకపోవచ్చు. దీనికి తోడు ఆ సమయంలో రివ్యూ వంటిది ఉంటే ఇక అధికారులను కలిసే పరిస్థితి ఉండదు. పబ్లిక్ ఆఫీసుల్లో ఇలా నియంత్రించడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

# డైట్‌లో ఘనంగా 57వ ఇంజనీర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - అనకాపల్లి: స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో 57 వ ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం డైట్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం , డైట్ ఐఈ (ఐ) స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్.ఎస్.టీ.ఎల్ అవుట్స్టాండింగ్ సైంటిస్ట్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగేసే పాల్గొన్నారు. డైట్ కళాశాలలో ప్రతిష్టించిన భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూల మాలతో నివాళ్లు అర్పించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లైవ్ ప్రాజెక్ట్ డెమోన్స్ట్రేషన్ లో పాల్గొని విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు. ఇన్నోవేషన్స్ , రీసెర్చ్ కొరకు డైట్ కళాశాల అందిస్తున్న సౌకర్యాలను కొనియాడారు. తదనంతరం డైట్ కళాశాల ఏసీ సెమినార్ హాల్ నందు కార్యక్రమం ప్రారంభించారు . ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి శ్రీమతి భార్గవి మాట్లాడుతూ. ప్రపంచంలో రష్యా తరువాత భారత దేశం ఎక్కువ మంది ఇంజినీర్లు అందిస్తుంది అని తెలియజేసారు. ప్రతి ఇంజనీర్ తమ కార్యనిర్వహణ లో ఎన్నో అడ్డంకులు కష్టాలు ఎదురుకోవాల్సి వస్తాది అని వాటిని ఎదురుకుంటూ ముందుకు సాగాలి అని భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య , భారత రత్న అబ్దుల్ కలాం వంటి మహోన్నత ఇంజినీర్ల జీవిత ఉదాహరణలు తెలియజేసారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ .వైకుంఠరావు మాట్లాడుతూ. విద్యార్థులు ఆధునిక నైపుణ్యతను పెంపొందించుకోవాలని, ఇందుకు విశ్వేశ్వరయ్య ని ప్రేరణ తీసుకోవాలని సూచించారు. డైట్ విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ. ఇంజనీర్ అంటే సివిల్ ఇంజనీర్ మాత్రమే గుర్తుకువచ్చే విధంగా సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నిస్వార్థంగా దేశానికీ చేసిన సేవను వివరించారు. డైట్ కళాశాలలో ఇంజనీరింగ్ కేవలం ఒక డిగ్రీ ల కాకుండా సదరు విద్యార్థిని సమాజానికి ఉపయోగపడేలా క్రియాశీలక ఇంజినీర్లను తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి విద్యార్థి స్వల్ప కాలిక , దీర్ఘ కాలిక లక్ష్యాలను కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులను ఉద్దేశిస్తూ మీరు నేర్చుకున్న పరిజ్ఞానం ప్రపంచానికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్.ఎస్.టీ.ఎల్ అవుట్స్టాండింగ్ సైంటిస్ట్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగేసే ప్రసంగిస్తూ విశ్వేశ్వరయ్య గొప్పతనం వివరిస్తూ సమయపాలన చాలా అవసరం అని తెలియజేసారు. అభిరుచి కల కలిగి ఉండాలని దానిని సాకారం చేయడానికి కష్టపడాలి అని సూచించారు. విద్యార్థులు విభిన్నంగా ఆలోచించడం అవసరం అని సైన్స్ అండ్ టెక్నాలజీలో సృజనాత్మకతను పెంపొందించాలి అని తెలియజేసారు. ఇంజినీరింగ్ పూర్తి చేయడమే కాకుండా నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలను మెరుగుపరుచుకోవచ్చు. ఇంజనీర్లు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని కనుగొనడం ద్వారా ప్రపంచాన్ని ప్రగతిశీల రీతిలో మార్చగలరు అని వివరించారు. ఇంజనీర్ అనే పదం కేవలం ఒక విభాగానికి పరిమితం కాదు అని ప్రపంచం అంతా ఒకే భువనైక కుటుంబం గా ఉండటానికి అందరి పరస్పర సహకారం , జ్ఞాన బదిలీ జరుగుతూ ఉండాలని పేర్కొన్నారు . మన సామజిక జీవన శైలి లో మనం వాడే ప్రతి వస్తువుకు ఒక ప్రమాణం ఉంటాది అని దానిని భవిష్యత్తు లో కాబోయే ప్రతి ఇంజనీర్ తెలుసుకోవాలని అభిలాషించారు. ఈ సందర్భంగా సెమిస్టర్ అకాడమిక్ టాపర్లకు 20 గ్రాముల వెండి మెడల్ బహూకరించారు. బెస్ట్ లైబ్రరీ యూసర్ అవార్డులను కూడా ఈ సందర్భంగా విద్యార్థులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డైట్ ఐ.ఈ.ఐ కన్వీనర్ వై హేమంత్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, సివిల్ ఇంజనీరింగ్ ఉప విభాగాధిపతి గంగాధర గుప్తా మరియు వివిధ ఇంజనీరింగ్ విభాగ అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకానికి పొగ పెడుతున్న ప్రభుత్వం

విశాలాంధ్ర - చోడవరం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులను పొమ్మన లేక అధికార ప్రభుత్వం పొగ పెట్టే పనిలో పడిందని ఎం.డి.ఎం. కార్మికులు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి ఆరోపిస్తున్నారు. దీనిపై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రతీ 100 మందికి ఒక భోజనం కౌంటర్ పెట్టాలని అధికారులు ఆదేశాలు జారి చేయడంతో స్కూల్స్ హెచ్.ఎం.లు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఖచ్చితంగా ఆరు కౌంటర్లు, లేదా ఐదు కౌంటర్లు పెట్టాలని హుకుమ్ జారి చేస్తున్నారని, కౌంటర్లు పెట్టడానికి సరిపడా కార్మికులు లేకుండా వంట పాత్రలు లేకుండా అన్ని కౌంటర్లు ఎలా పెట్టాలని మధ్యాహ్నం భోజన పథకం రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి ప్రశ్నించారు. ప్రభుత్వ విధానంతో మధ్యాహ్నం భోజన కార్మికులు ఎంత ఆందోళన చెందుతారని అన్నారు. కనీస ఆలోచన లేకుండా ఇలా పొమ్మనకుండా పొగ పెట్టే పద్ధతిలో వ్యవహరించడం దుర్మార్గంగా ఉందని, దీనివల్ల స్కూల్స్ ఒత్తిడి తట్టుకోలేక ఆవేదన చెందాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు వర్కర్స్ ని స్కూల్స్ కుదించేస్తూ 9, 10 వంట చేస్తున్న కార్మికులకు వేతనం కూడా లేకుండా ప్రతి హై స్కూల్ కి ముగ్గురు లేదా నలుగురు కార్మికులను ఇస్తున్నారని, ఆరు కౌంటర్ల ద్వారా సుమారు 18 మంది తో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది ఎలా సాధ్యమని ఆమె ప్రశ్నించారు. అవసరమైతే శానిటేషన్ కార్మికుల సహాయం తీసుకోవాలని చెబుతున్నారన్నారు. వాస్ రూమ్స్ క్లీన్ చేసే వాళ్లు భోజనం పిల్లలకు ఎలా వడ్డిస్తారని అన్నారు. ఇలాంటి రకరకాల పని పద్ధతులను తీసుకొస్తే ఎలా అని, దీనివల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఎంత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుందో కనీసం అర్థం చేసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. స్కూల్స్ ఎలాంటి సదుపాయాలు లేకుండా రకరకాలుగా పని ఒత్తిడికి గురిచేస్తూ పథకాన్ని నీరు గారిచే పనులు ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు చేస్తున్నారనేది తేటతెల్లం అవుతుందని ఆమె అన్నారు. ఇప్పటికైనా వందలాదిమందికి వంట చేస్తున్న కార్మికుల శ్రమ ని అర్థం చేసుకుని జిల్లా అధికారులు ప్రభుత్వం ఆలోచన చేయాలని మధ్యాహ్న భోజన యూనియన్ గా డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ బుచ్చి రాజమ్మ, బి లక్ష్మి, మంగమ్మ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ పలు అభివృద్ధి పనులకు స్థాయి సంఘం ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని స్థాయి సంఘం చైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్థాయి సంఘం సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన స్థాయి సంఘం సభ్యులు విల్లూరి భాస్కరరావు, గొలగాని వీరరావు, పిసిని వరాహ మహా లక్ష్మీనరసింహం, గల్లా పోలిపల్లి, బొమ్మిడి రమణ, బల్ల శ్రీనివాసరావు, శరగడం రాజశేఖర్, నొల్లి నూక రత్న, లక్ష్మీబాయి పులి, పిళ్ళా మంగమ్మ లతో స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయి సంఘం చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం సమావేశంలో 280 అంశాలుతో కూడిన అజెండాను పొందుపరచగా, అందులో 152 అంశాలు పై చర్చ జరిగిందని, విజయవాడ వరద సహాయక కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొనగా వారు అందుబాటులో లేనందున చర్చ జరగగా 50 అంశాలును వాయిదా వేయడమైనదని, 102 అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించారని, మిగిలిన 128 అంశాలు సమయాభావం వలన సెప్టెంబర్ 17వ తేదీ మంగళవారం నాటికి వాయిదా వేసి స్థాయి సంఘ సమావేశాన్ని మరలా నిర్వహించబడునని చైర్ పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, జోనల్ కమిషనర్లు కె.కనకమహాలక్ష్మి, హేమావతి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవ రెడ్డి, కార్యనిర్వాక ఇంజినీర్లు దిలీప్, రత్నాకర్, రెడ్డి చిరంజీవి, సహాయక వైద్యాధికారులు డాక్టర్ సునీల్ కుమార్, అప్పలనాయుడు, కృష్ణంరాజు, ప్రసాదరావు, బయాలజిస్ట్ సాంబమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పి.పద్మజ, ఉప కార్యనిర్వహాక ఇంజినీర్లు వంశీ క్రిష్ణ, భరణి కుమార్, శ్రీనివాస్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.